

# హోరాహోరీగా నెట్‌బాల్ టోర్నీ

**బరిలో 28 రాష్ట్రాల ప్లేయర్లు**

మహబూబ్‌నగర్ టౌన్, జనవరి 13: జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో జాతీయ స్థాయి ఫాస్ట్-5 మహిళల, పురుషుల నెట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీ శనివారం ఘనంగా ప్రారంభమైంది. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, నెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ విజేందర్‌సింగ్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. తొలి రోజు పురుషుల విభాగంలో జరిగిన మ్యాచ్‌లో హర్యానా జట్టు 44-22తో ఏపీపై ఘన విజయం సాధించింది. మహిళల కేటగిరీలో బీహార్29-11 తేడాతో ఏపీపై గెలిచింది.


# హైదరాబాద్ రెండో విజయం


రోహిత్ రాయుడు (124*)

హైదరాబాద్, ఆట ప్రతినిధి: దేశవాళీ ప్రతిష్ఠాత్మక టోర్నీ రంజీ ట్రోఫీలో హైదరాబాద్ వరుసగా రెండో విజయం నమోదు చేసుకుంది. ప్లేట్ గ్రూప్‌లో భాగంగా జరిగిన పోరులో హైదరాబాద్ ఇన్నింగ్స్ 81 పరుగుల తేడాతో మేఘాలయను చిత్తుచేసింది. గత మ్యాచ్‌ను రెండు రోజుల్లోనే ముగించిన హైదరాబాద్.. ఈసారి కూడా అదే తరహాలో రెండోసారి బ్యాటింగ్‌కు దిగకుండానే ప్రత్యర్థి పని పట్టింది. తొలి ఇన్నింగ్స్‌లో మేఘాలయ 111 పరుగులకు ఆలౌట్ కాగా.. హైదరాబాద్ 346/7 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. రోహిత్ రాయుడు (124 నాటౌట్) శతక్కొట్టగా.. చందన్ సహాని (52), సీవీ మిలింద్ (50) హాఫ్‌సెంచరీలు చేశారు. రెండో ఇన్నింగ్స్‌లో మేఘాలయ 154 పరుగులకే ఆలౌటైంది.

# మరొక్క అడుగే!

**మలేషియా ఓపెన్ ఫైనల్లో సాత్విక్ జోడీ**



కౌలాలాంపూర్: సీజన్ ఆరంభ టోర్నీలో భారత షట్లర్లు సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి విజృంభిస్తున్నారు. మలేషియా ఓపెన్‌లో వరుస విజయాలు నమోదు చేసుకున్న ఈ జోడీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం జరిగిన బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్-1000 పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో సాత్విక్-చిరాగ్ జోడీ 21-18, 22-20తో ప్రపంచ చాంపియన్లు సియో సాగ్ జాయ్-కాంగ్ మిన్ (కొరియా) ద్వయంపై విజయం సాధించింది. నిరుడు ఆసియా గేమ్స్‌లో స్వర్ణంతో పాటు ఆరు టైటిల్స్ ఖాతాలో వేసుకున్న సాత్విక్ జంట.. ఈ టోర్నీలో అదే జోరు కొనసాగించింది. తీవ్ర ఉత్కంఠభరితంగా సాగిన సెమీస్‌లో ఒక దశలో ఆరు పాయింట్లతో వెనుకంజలో ఉండి కూడా.. వరుసగా ఎనిమిది పాయింట్లు నెగ్గి మ్యాచ్‌ను ముగించింది.

# కింగ్ ఈజ్ బ్యాక్

బరిలోకి కోహ్లీ
రాత్రి 7 నుంచి

## నేడు భారత్, అఫ్ఘానిస్థాన్ మధ్య రెండో టీ20

**ఫార్మాట్‌తో సంబంధం లేకుండా.. బరిలోకి దిగితే దుమ్మురేపడమే పరమావధిగా సాగే విరాట్ కోహ్లీ చాన్నాళ్ల తర్వాత పొట్టి క్రికెట్‌లో అడుగుపెడుతున్నాడు. గత టీ20 ప్రపంచకప్ తర్వాత ఈ ఫార్మాట్‌కు విరామమిచ్చిన కింగ్.. 14 నెలల తర్వాత టీమ్‌ఇండియా తరఫున టీ20 మ్యాచ్ ఆడనున్నాడు. అఫ్ఘానిస్థాన్‌తో ఆదివారం జరగనున్న రెండో టీ20లో రోహిత్, విరాట్ దంచికొట్టేందుకు సిద్ధమైతే.. కాబూలీలు స్పిన్‌తో భారత్‌ను తిప్పలు పెట్టాలని ప్రయత్నాలు చేస్తున్నారు. మరి టీమ్‌ఇండియా ఇండోర్‌లోనే ఇరగదీసి సిరీస్ పట్టేస్తుందా.. లేక ప్రత్యర్థి పైచేయి సాధిస్తుందా చూడాలి!**



ఇండోర్: ఈ ఏడాది టీ20 ప్రపంచకప్ జరగనున్న నేపథ్యంలో.. భారత జట్టు అందుకు ఇప్పటి నుంచే సన్నాహాలు మొదలెట్టింది. చాన్నాళ్లుగా ఈ ఫార్మాట్‌కు దూరంగా ఉంటున్న సీనియర్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీని అఫ్ఘానిస్థాన్‌తో సిరీస్‌కు ఎంపిక చేసింది. తొలి మ్యాచ్‌కు వ్యక్తిగత కారణాలతో దూరమైన కోహ్లీ.. ఆదివారం జరగనున్న రెండో పోరుకు అందుబాటులో ఉండనున్నాడు. దీంతో ఈ మ్యాచ్‌పై అంచనాలు పెరిగిపోగా.. 14 నెలల తర్వాత విరాట్ భారత్ తరఫున టీ20 మ్యాచ్ ఆడనున్నాడు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా మొహాలీలో అఫ్ఘాన్‌పై అలవోక విజయం సాధించిన రోహిత్ సేన అదే జోరులో సిరీస్ పట్టేయాలని చూస్తుంటే.. స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ అందుబాటులో లేకున్నా.. స్పిన్ అస్త్రంతోనే టీమ్‌ఇండియాను ఇబ్బంది పెట్టాలని అఫ్ఘాన్ ఆలోచిస్తున్నది. గాయం కారణంగా గత మ్యాచ్‌కు అందుబాటులో లేకపోయిన యశస్వి జైస్వాల్ ఫిట్‌నెస్ సాధించాడు. ఒపెనింగ్ స్థానం కోసం గిల్, జైస్వాల్ మధ్య పోటీ ఉండనుంది. అనూహ్యంగా రోహిత్‌తో కలిసి కోహ్లీ ఇన్నింగ్స్ ఆరంభించినా ఆశ్చర్యపోవాల్సిన పని లేదు. వరల్డ్‌కప్‌నకు ముందు టీమ్‌ఇండియా మరో రెండు టీ20 మ్యాచ్‌లు మాత్రమే ఆడనుండటంతో.. జట్టు కూర్పు సరిచూసుకునేందుకు ఈ మ్యాచ్ ఉపయోగపడనుంది. కోహ్లీ రాకతో హైదరాబాదీ కుర్రాడు తిలక్ వర్మ చోటు గల్లంతయ్యేలా కనిపిస్తున్నది. మిడిలార్డర్‌లో యువ ఆటగాళ్లు శివమ్ దూబే, రింకూసింగ్, జితేశ్ శర్మ సత్తాచాటేందుకు సిద్ధంగా ఉన్నారు. బౌలింగ్‌లో మరోసారి ఇద్దరు పేసర్లు, ముగ్గురు స్పిన్నర్ల ప్లాన్‌కే పరిమితం కావచ్చు. పేసర్లుగా అర్ష్‌దీప్, ముఖేశ్ ఖాయమే కాగా.. అక్షర్, సుందర్, బిష్ణోయ్ స్పిన్ బాధ్యతలు పంచుకోనున్నారు. కుల్దీప్‌ను కూడా పరిశీలించవచ్చు. మరోవైపు.. తొలి మ్యాచ్లో మంచి పోటీనిచ్చిన అఫ్ఘాన్ ఈ సారి టీమ్‌ఇండియా స్టార్లను అడ్డుకోవాలని భావిస్తున్నది.

### తుది జట్లు (అంచనా)

**భారత్:** రోహిత్ (కెప్టెన్), గిల్/జైస్వాల్, కోహ్లీ, దూబే, రింకూ, జితేశ్, అక్షర్, సుందర్, కుల్దీప్/రవి, అర్ష్‌దీప్, ముఖేశ్.
**అఫ్ఘానిస్థాన్:** ఇబ్రహీం (కెప్టెన్), రహ్మనుల్లా, హష్మతుల్లా, అజ్మతుల్లా, నబీ, నజీబుల్లా, కరీమ్, నైబ్, ముజీబ్, నవీన్, ఫజల్

### పిచ్, వాతావరణం

ఇండోర్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలం.. గతంలో ఇక్కడ జరిగిన మ్యాచ్‌ల్లో భారీ స్కోర్లు నమోదయ్యాయి. బౌండ్రీ చిన్నది కావడంతో పరుగుల పండగే. మొహాలీలో చలితో తీవ్రంగా ఇబ్బంది పడిన ఆటగాళ్లకు ఇక్కడ వేడి వాతావరణం స్వాగతం పలకనుంది.



## భువీ సూపర్ 8

కాన్పూర్: సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్.. రంజీ ట్రోఫీలో అదరగొట్టాడు. భారత టెస్టు జట్టులో చోటు దక్కించుకునే ప్రయత్నాల్లో ఉన్న భువీ.. రంజీ ట్రోఫీలో ఉత్తరప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. గ్రూప్-బీలోబెంగాల్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో భువీ 8 వికెట్లతో విజృంభించాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఇవే (8/41)అత్యుత్తమ గణాంకాలు కావడం విశేషం. ఫలితంగా బెంగాల్ తొలి ఇన్నింగ్స్‌లో 188 పరుగులకు ఆలౌటైంది. మహమ్మద్ షమీ సోదరుడు కైఫ్ (45 నాటౌట్) రాణించాడు. అంతకుముందు ఉత్తరప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 60 పరుగులకే ఆలౌటైంది.

## విజయ్‌వీర్‌కు పారిస్ బెర్తు



జకార్తా: భారత షూటర్ విజయ్‌వీర్ సిద్ధు పారిస్ ఒలింపిక్స్ బెర్త్ దక్కించుకున్నాడు. ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్‌లో రజత పతకం సాధించడం ద్వారా విజయ్‌వీర్ విశ్వక్రీడలకు అర్హత సాధించాడు. దీంతో పారిస్ విశ్వక్రీడల షూటింగ్‌లో భారత్ బెర్తుల సంఖ్య 17కు చేరుకుంది. శనివారం జరిగిన పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ ఈవెంట్‌లో 21 ఏండ్ల విజయ్‌వీర్ రెండో స్థానంలో నిలిచాడు.

### త్రిష పూజిత సారథ్యంలో..



హైదరాబాద్, ఆట ప్రతినిధి: విజయవాడ వేదికగా ఈ నెల 26వ తేదీ నుంచి మొదలయ్యే మహిళల అండర్-23 వన్డే టోర్నీ కోసం శనివారం హైదరాబాద్ జట్టును ఎంపిక చేశారు. త్రిష పూజిత కెప్టెన్‌గా, ప్రణవి చంద్ర వైస్ కెప్టెన్‌గా మొత్తం 13 మందితో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) టీమ్‌ను ప్రకటించింది. జాతీయ స్థాయి టోర్నీల్లో నిలకడగా రాణిస్తున్న గొంగడి త్రిష, మమత జట్టులో చోటు నిలుపుకున్నారు.

# భారత్ ఓటమి

**ఏఎఫ్‌సీ ఏషియన్ కప్**




ఆల్ రయాన్(ఖతార్): ఏఎఫ్‌సీ ఏషియన్ కప్‌లో భారత్‌కు నిరాశే ఎదురైంది. శనివారం జరిగిన గ్రూపు-బి మ్యాచ్‌లో భారత్ 0-2 తేడాతో మాజీ చాంపియన్ ఆస్ట్రేలియా చేతిలో ఓటమిపాలైంది. తొలి అర్ధభాగంలో 50నిమిషాల వరకు ఆసీస్‌ను గోల్ చేయకుండా అడ్డుకున్న టీమ్‌ఇండియా అద్భుత పోరాటపటిమ కనబరిచింది. కీలకమైన ద్వితీయార్ధ మొదలైన కొద్దిసేపట్లోనే జాక్సన్ ఇర్విన్ గోల్ ద్వారా ఆసీస్ ఖాతా తెరిచింది. భారత్ గోల్‌పోస్ట్‌పై పదేపదే దాడులు చేసిన ఆసీస్ 73వ నిమిషంలో జోర్డాన్ బాస్ ద్వారా మరో గోల్ అందుకుంది. మొత్తంగా తమ కంటే మెరుగైన ర్యాంక్‌లో ఉన్న ఆసీస్‌కు ఇగోర్ స్టిమాక్ నేతృత్వంలోని టీమ్‌ఇండియా దీటైన పోటీ నివ్వడంలో సఫలమైంది. ఈ నెల 18న ఉజ్బెకిస్థాన్‌తో భారత్ తలపడుతుంది.

### రోహిత్ తీరు సరైంది కాదు..

మొహాలీ: అఫ్ఘానిస్థాన్‌తో తొలి టీ20 మ్యాచ్‌లో టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ రనౌట్‌పై విభిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇన్నింగ్స్ రెండో బంతికే మరో ఓపెనర్ శుభ్‌మన్ గిల్‌తో సమన్వయ లోపంతో రోహిత్ రనౌట్‌గా వెనుదిరిగాడు. దీనిపై మ్యాచ్ వ్యాఖ్యాత స్పందిస్తూ 'రోహిత్ షాట్‌ను గిల్ అలా చూస్తుండిపోయాడు. అదే సమయంలో రన్ కోసం రోహిత్ సగం పిచ్ దాటేశాడు. ఇద్దరి మధ్య సమన్వయం లేకపోవడంతో వికెట్ కోల్పోవాల్సి వచ్చింది' అని అన్నాడు.


అల్టిమేట్ ఖో ఖో సీజన్-2లో గుజరాత్ జెయింట్స్ విజేతగా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్లో గుజరాత్ 31-26తో చెన్నైపై విజయం సాధించింది. తెలుగు యోధాస్ నాలుగో స్థానంలో నిలిచింది.

## వాణిజ్య



### బంగారం ధరలు మరింత పైకి

హైదరాబాద్, జనవరి 13: బంగారం ధరలు మరింత పెరిగాయి. గత కొన్ని రోజులుగా తగ్గుతూ వచ్చిన పసిడి మళ్లీ ప్రియమైంది. అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ అధికంగా ఉండటంతోపాటు దేశీయంగా కొనుగోళ్లు ఊపందుకోవడం ధరలు పెరగడానికి ప్రధాన కారణం. ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం బంగారం ధర రూ.320 ఎగబాకి రూ.63,420కి చేరుకోగా, రూ.500 అధికమైన కిలో వెండి రూ.76,500 పలికింది. ఇటు హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.300 అధికమై రూ.58 వేలు పలికింది. అలాగే 24 క్యారెట్ల ధర రూ.320 పెరిగి రూ.63,270కి చేరుకున్నది.

### మూడు బ్యాంక్‌లకు రిజర్వ్ బ్యాంక్ షాక్

ముంబై, జనవరి 13: మూడు ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులకు రిజర్వు బ్యాంక్ షాకిచ్చింది. మూడు బ్యాంక్‌లపై రూ.2.49 కోట్ల జరిమానా విధించాయి. నిబంధనలు పట్టించుకోకుండా ఇష్టంవచ్చినట్లు వ్యవహరించినందుకుగాను ధనలక్ష్మీ బ్యాంక్‌తోపాటు పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్‌లపై ఈ జరిమానా విధించింది. వీటిలో ధనలక్ష్మీ బ్యాంక్‌పై రూ.1.20 కోట్లు, పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్‌పై కోటి రూపాయలు, ఈఎస్‌ఏఎఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌పై రూ.29 లక్షలు విధించింది.

### మైఖేల్ దేబబ్రత పదవీ కాలం పొడిగింపు

న్యూఢిల్లీ, జనవరి 13: రిజర్వు బ్యాంక్ డిప్యూటీ గవర్నర్ మైఖేల్ దేబబ్రత పదవీ కాలాన్ని మరో ఏడాది పాటు పొడిగించింది. ప్రస్తుతం ఆయన పదవీకాలం ఈ నెల 14తో ముగియనున్నది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన క్యాబినెట్ ది అపాయింట్‌మెంట్స్ కమిటీ సమావేశమై మైఖేల్ పదవీ కాలాన్ని మరో ఏడాది పొడిగించింది.

# 5జీకి అదనపు చార్జి

**వచ్చే క్యూ2లో టారిఫ్‌లు పెంచనున్న జియో, ఎయిర్‌టెల్**




న్యూఢిల్లీ, జనవరి 13: వినియోగదారులకు కొత్తగా అందుబాటులోకి తెచ్చిన 5జీ సేవలపై.. 4జీతో పోలిస్తే మరో 10 శాతం అదనపు చార్జీలను వసూలు చేసేందుకు టెలికం కంపెనీలు సిద్ధమవుతున్నాయి. అంతేకాకుండా వచ్చే ఆర్థిక సంవత్సరం క్యూ2లో (జూలై-సెప్టెంబర్) మొత్తంగా మొబైల్ టారిఫ్‌లను కనీసం 20 శాతం మేర పెంచాలని యోచిస్తున్నాయి. అలాగే ప్రీమియం కస్టమర్లకు రిలయన్స్ జియో, భారతి ఎయిర్‌టెల్‌లు ప్రస్తుతం అందిస్తున్న అన్‌లిమిటెడ్ 5జీ డాటా ప్లాన్లను ఉపసంహరించి, 2024 ద్వితీయార్థంలో 4జీ ప్లాన్లకు వసూలు చేస్తున్న టారిఫ్‌లకు 5-10 శాతం అదనంగా 5జీ ప్లాన్లకు ధరల్ని ప్రతిపాదిస్తున్నట్టు సమాచారం. దాదాపు ఏడాదికాలంగా జియో, ఎయిర్‌టెల్‌లు 4జీ రేట్లకే 5జీ సర్వీసుల్ని అందించడంతో పాటు 4జీ వినియోగదారులు 5జీకి అప్‌గ్రేడ్ చేసుకునేలా ప్రోత్సహించడానికి అన్‌లిమిటెడ్ 5జీ డాటాను సైతం ఆఫర్ చేస్తున్నాయి.

**పెట్టుబడులపై రాబడి కోసం**

దేశవ్యాప్తంగా 5జీ సర్వీసుల్ని ప్రవేశపెట్టడానికి, కస్టమర్లను సంపాదించుకోవడానికి చేసిన భారీ పెట్టుబడులకు తగిన రాబడుల్ని ఆర్జించేదిశగా జియో, ఎయిర్‌టెల్‌లు దృష్టి నిలిపాయని విశ్లేషకులు చెపుతున్నారు. 5జీ కవరేజ్ దాదాపు పూర్తికావొస్తున్నందున, అన్‌లిమిటెడ్ 5జీ డాటా ఆఫర్లను నిలిపివేసి, ఈ సర్వీసుల కోసం ప్రత్యేక ప్లాన్లను ఈ సంవత్సరం ద్వితీయార్థంలో ప్రవేశపెడతాయని అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ జెఫ్పరీస్ ఒక రీసెర్చ్ నోట్‌లో వివరించింది. ఎయిర్‌టెల్, జియోలు 4జీకంటే 5-10 శాతం అదనపు ధరతో 5జీ ప్లాన్లకు విడుదల చేస్తాయని అంచనా వేసింది. అయితే అటువంటి ప్లాన్ల వైపు వినియోగదారుల్ని ఆకర్షించేందుకు 30-40 శాతం డాటాను అదనంగా ఇచ్చే అవకాశం ఉన్నదని పేర్కొంది.

**4జీకి మరింత బాదుడు**

ప్రస్తుతం అధికశాతం వినియోగదారులు వాడుతున్న 4జీ సర్వీసుల ఛార్జీలను సైతం పెంచుతామంటూ పరిశ్రమ అధికారులు ఇప్పటికే సంకేతాలు ఇవ్వగా, జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో 20 శాతం వరకూ టారిఫ్‌లు పెరుగుతాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. తమకు యూజర్ల నుంచి వస్తున్న సగటు ఆదాయాన్ని (ఏపీఆర్‌యూ) పెంచుకోవడానికి సరైన సమయంలో మొబైల్ టారిఫ్‌లను అధికం చేయడానికి వెనుకాడబోమని ఇటీవల భారతి ఎయిర్‌టెల్ మేనేజింగ్ డైరెక్టర్ గోపాల్ విఠల్ చెప్పారు. ప్రస్తుతం రూ.200 ఉన్న ఏపీఆర్‌యూను రూ.250 వరకూ పెంచుకోవాలన్నది ఎయిర్‌టెల్ ప్రణాళిక. ఎయిర్‌టెల్, జియోలకు ఒక్కో చందాదారుకు టెలికం కంపెనీలు చేస్తున్న నెట్‌వర్క్ నిర్వహణా వ్యయం ఇప్పటికే రూ.66కు చేరుకున్నదని, 5జీ సర్వీసులతో ఇది మరింత పెరుగుతుందని కోటక్ ఇనిస్టిట్యూషనల్ ఈక్విటీస్ పేర్కొంది. ఈ నేపథ్యంలో టారీఫ్‌లు పెరగక తప్పదని అంచనా వేసింది. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తర్వాత టారిఫ్‌ల పెంపు కేంద్ర ప్రభుత్వానికీ ఆమోదయోగ్యంగానే ఉంటుందని విశ్లేషకులు అంటున్నారు. వోడాఫోన్‌ఐడియాలో కేంద్రానికి 33 శాతం వాటా కూడా ఉన్నందున, 4జీ ప్లాన్ల ధరల పెంపును ప్రభుత్వం నిలువరించబోదని చెపుతున్నారు. భారత్‌లో మొబైల్ రంగ సంస్థల ఆదాయం రూ.2,77,300 కోట్ల(34 బిలియన్ డాలర్లు)కు చేరుకుంటుందని అంచనావేస్తున్నది. 2025-26 నాటికి ఇది రూ.3,07,800 కోట్లకు చేరుకోనున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.2,46,800 కోట్లుగా ఉన్నది. ఇతర సంస్థలు దూసుకుపోతుంటే వొడాఫోన్ ఐడియా మాత్రం నెమ్మదించింది. రుణ సంక్షోభంలో కూరుకుపోయిన సంస్థ..5జీ సేవలు ఇప్పటికీ ప్రారంభించలేకపోయింది. దేశీయ టెలికం రంగం నుంచి వైదొలుగాలని కంపెనీ చూస్తున్నట్లు తెలుస్తున్నది. ఒక్కప్పుడు డజన్‌కు పైగా ఉన్న టెలికం సంస్థలు నిర్వహణ ఖర్చులు తడిసిమోపెడు కావడంతో తమ వ్యాపారాన్ని మూసివేశాయి కూడా.




## ఫ్లిప్‌కార్ట్‌లో రిపబ్లిక్ డే ఆఫర్లు

న్యూఢిల్లీ, జనవరి 13: ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్..రిపబ్లిక్ డే సేల్‌ను ప్రకటించింది. ఈ నెల 19 వరకు అమలులో ఉండనున్న ఈ ఆఫర్ కింద ఐఫోన్లను గొప్ప తగ్గింపు ధరకు విక్రయిస్తున్నట్లు ప్రకటించింది. ఐఫోన్ 15, ఐఫోన్ 14లను 17 శాతం వరకు తగ్గించి విక్రయిస్తున్నది. వీటితోపాటు పలు బ్యాంకులకు చెందిన కార్డులపై ఎక్స్ఛేంజ్ ఆఫర్ అందిస్తున్నది. ప్రస్తుతం మార్కెట్లో యాపిల్ ఐఫోన్ 15 ధర రూ.79,900 కాగా, ఫ్లిప్‌కార్ట్‌లో మాత్రం 17 శాతం తగ్గింపుతో రూ.65,999కి లభించనున్నది. 128 జీబీ మెమొరీతో 6.1 అంగుళాల టచ్‌స్క్రీన్ సూపర్ రెటినా ఎక్స్‌డీఆర్ డిస్‌ప్లే, ముందు 12 మెగాపిక్సెల్ కెమెరా, 48 మెగాపిక్సెల్ రియర్ కెమెరా వంటి ఫీచర్స్ ఉన్నాయి. అలాగే రూ.69,900 ధర కలిగిన ఐఫోన్ 14ని రూ.57,999కి దించింది.

## డీ-మార్ట్ లాభం 691 కోట్లు




ముంబై, జనవరి 13: డీ-మార్ట్ పేరుతో రిటైల్ అవుట్‌లెట్లను నిర్వహిస్తున్న అవెన్యూ సూపర్‌మార్ట్స్ లిమిటెడ్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.690.41 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో సంస్థ రూ.589.64 కోట్ల నికర లాభాన్ని గడించింది. గత త్రైమాసికంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 17.31 శాతం ఎగబాకి రూ.11,569.05 కోట్ల నుంచి రూ.13,572.47 కోట్లకు చేరుకున్నది. నిర్వహణ ఖర్చులు సైతం 17.31 శాతం అందుకొని రూ.12,656.46 కోట్లకు చేరుకోవడంలో లాభాల్లో భారీ వృద్ధికి బ్రేక్‌లు వేసినట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం సంస్థకు తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఎన్‌సీఆర్, తమిళనాడు, పంజాబ్, రాజస్థాన్, మహారాష్ట్ర రాష్ర్టాల్లో 341 స్టోర్లను నిర్వహిస్తున్నది. మరోవైపు, కంపెనీ ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా హరీష్‌చంద్ర ఎం భరుకా నియమితులయ్యారు.

## ప్యాసింజర్‌కు ఎస్‌యూవీ కిక్కు

**2023లో అమ్ముడైన 40 లక్షల వాహన విక్రయాలు: సియామ్**



న్యూఢిల్లీ, జనవరి 13: దేశవ్యాప్తంగా ప్యాసింజర్ వాహన విక్రయాలు టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నాయి. 2023లో తొలిసారిగా దేశీయంగా 40 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి. యుటిలిటీ వాహనాలకు డిమాండ్ అధికంగా ఉండటం వల్లనే రికార్డు స్థాయికి చేరుకున్నాయని భారత్ ఆటోమొబైల్ తయారీదారుల సంఘం(సియామ్) వెల్లడించింది. 2023లో 41,01,600 యూనిట్ల ప్యాసింజర్ వాహనాలు అమ్ముడయ్యాయి. 2022లో నమోదైన 37,92,444 యూనిట్లతో పోలిస్తే 8 శాతం అధికమని పేర్కొంది.

- యుటిలిటీ వాహన విక్రయాలు 19,22,805 యూనిట్ల నుంచి 22 శాతం అధికమై 23,53,605లకు చేరుకున్నాయి.
- వ్యాన్ల అమ్మకాలు 1,32,468 యూనిట్ల నుంచి 1,46,122లకు పెరిగాయి.
- హోల్‌సేల్ ప్యాసింజర్ కార్ల అమ్మకాలు ఏడాది ప్రాతిపదికన 8 శాతం తగ్గి 17,37,171 నుంచి 16,01,873లకు పడిపోయాయి.
- త్రి చక్ర వాహన సేల్స్ 4,18,510 యూనిట్ల నుంచి 6,80,550లకు చేరాయి.

## కోలుకోనున్న రూపాయి

**కేంద్ర మంత్రి పీయూష్ గోయల్**

న్యూఢిల్లీ, జనవరి 13: గడిచిన పదేండ్లుగా రికార్డు స్థాయిలో పెరిగిన రూపాయి విలువ క్రమంగా తగ్గనున్నదని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. అంతర్జాతీయ ఫారెక్స్ మార్కెట్లో డాలర్ బలహీనంగా ట్రేడవుతుండటం, దేశ ఆర్థిక వ్యవస్థ అత్యంత వేగంగా వృద్ధిని సాధిస్తుండటంతో భవిష్యత్తులో రూపాయి కోలుకుంటుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. దేశ వృద్ధిని పరుగులు పెట్టించడానికి ఆర్థిక మంత్రిత్వ శాఖ, రిజర్వు బ్యాంక్‌లు గట్టిగానే కృషి చేస్తున్నాయని, అయినప్పటికీ ఆశించిన స్థాయికి చేరుకోవడం లేదని వ్యాఖ్యానించారు. వృద్ధికి ఊతమివ్వడానికి కేంద్ర ప్రభుత్వం పలు కీలక చర్యలు తీసుకుంటున్నదని, ముఖ్యంగా ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంగా భారత్ త్వరలో అవతరించనున్నదన్నారు. ప్రస్తుతం స్థిరంగా ఉన్న రూపాయి, ఏడాదిలో 3 శాతం నుంచి 3.5 శాతం వరకు తన విలువను కోల్పోతున్నదని, దేశ ఆర్థిక వ్యవస్థ చేడు చేస్తున్నదని చెప్పారు. వచ్చే పదేండ్లలో రూపాయి విలువ అర శాతం నుంచి 0.75 శాతం వరకు తగ్గే అవకాశాలున్నాయి ఇండియా బ్యాంకింగ్ కన్‌క్లేవ్ ఏర్పాటు చేసిన సదస్సులో పేర్కొన్నారు.






Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.